# రచయిత్రుల తెలుగు I

యహాంకీ గురూ గారూ! హనుమాయమ్మల నవల్స్ రెండు చదివాను అండం రైటా, రెండు హనుమాయమ్మల నవల్సు చదివాను అండం రైటా అని మా వార్ని నచకేతుడు యముడ్ని అడిగినట్టు దేహమంతా సందేహాల్తో నిండిపోయి తహతహలాడ్తూ ప్రశ్నించాను.

"ఛీ అవతలికి పో సీరియల్దానా!" అని వారు ఛీత్కారంచేశారు. నేను సీరియల్స్ తెగ చదువుతాననీ సీరియల్స్ తప్ప (బంగాళాదుంపకూర తప్ప మరోటి ముట్టనని ప్రమాణంచేసినట్లు) మరోటి ముట్టననీ, అంచేత నేను చెడిపోయానని మావారి థీరీ. నా ఆలోచన్లూ, నా భాషా, నా టేస్టూ నేను చదివే సీరియల్స్ వలన కండిషనై పోతాయని మా యముడిగారి తాత్పర్యం. సీరియల్స్ రాసే రచయిత్రులకి తెలుగురాదనీ, భాషరాదనీ, వాళ్ళుచేసే సాహిత్యసేవ సాహిత్యహింసాకాండఅనీ మావారికో స్పెషల్ ప్రెజుడిస్ వుందుంది. అది వాళ్ళనే మనలేక నామీద చూపిస్తుంటారు. నాకు బాగా తెలుగు రాదనుకోండి. మావారికీ రాదనే నా అభిప్రాయం. హి ఆల్సో డజ్నాట్ నో-అనగా అతగాడిక్కూడా యంతమాత్రం తెలుగు తెలీదు. హనుమాయమ్మ నవల్స్మీద నేను మైసూర్పాక్ పందెం వేశాను. వాళ్ళకు తెలుగు రాదంటున్నారు గదా! మరివారు రాసేదంతా హాట్ కేక్స్లాగా చదువుతున్నారని చెప్పబడుతున్నది కదా. దీని భావమేమి తిరుమలేశ అని మా యముడిగార్ని నిలేసి అడిగాను. షటప్ అన్నారు. మీరే షటప్పు— పాప్యులర్గా రాస్తున్నందుకు మీరు ఉడుకుమోత్తనంకొద్దీ "బెగ్గా లాంగ్వేజీ" వారికి రాదని అంటున్నారుగాని అది ప్యూర్ జెలసీతో కూడుకున్నటువంటిముక్క— అని నేను వార్ని కొంచెం

గిల్లాను. గిల్లానంటే యాక్చువల్లీ గిల్లడంకాదు కొంచెంగోకాను. (అబ్బ గోకడంకూడా కాదు) రెచ్చగొట్టాను. (ఛ ఛ రెచ్చగొట్టడం కాదు) ఆ ఆ—ప్రొవోక్ చేశాను! ప్రొవోక్ చేయడమంటే మూలకూర్చున్న మనిషిని (మూలకూర్చోవడమంటే చెడ్డ అర్థంతోకాదు మహాప్రభో) గిల్లి రక్కి—పీకి యీడ్చుకురావటం అన్నమాట. పైకి నేనెప్పుడు తిరపతి వెంకటేశ్వరస్వామి మీద పందెం మొక్కు మొక్కాను. మీరు రచయిత్రులకు తెలుగురాదని రుజూచేస్తే జుట్టు తీయించుకోనక్కర్లేదు లేకపోతే తీయించుకోవాలని— ఆయన ఆవల్ రైటుగా ఒప్పేసుకున్నారు. అప్పుడిహ ఇద్దరం వీక్లీలూ, మంత్లీలూ, పాకెట్ బుక్సూ అన్నీ తెచ్చి అందులోంచి రచయిత్రుల తెలుగురచన్స క్షీరనీరన్యాయ ప్రకారం వేరుచేసి నిష్పాక్షికంగా రెండు కళ్ళతోనూ చూసింది చూసినట్టు చదవదల్చుకున్నాము. మా యముడుగారు ట్రాప్‌లో పడ్డారుగదా అని నాకు సంతోషం వేసింది కాని రచయిత్రుల బండారం బైటపెడ్తున్నానని నాకప్పుడనిపించలేదు. మావారు చాకు పైకితీశారు. చెప్పొద్దూ— యీ రచన్స చదివితే అంత ఉద్రేకం వస్తుందని నేననుకోలేదుస్మీ! కాని నేనే అపార్థంచేసుకున్నాను కథల్లో నాయికలా— వారు పెన్సిల్ చెక్కుకుంటున్నారు. చెక్కుకోండి ఎవరి ఖర్మ వారిది. ఆ పెన్సిల్తో అక్కడాఅక్కడా కొన్ని వాక్యమ్సు అండర్‌లైన్‌చేశారు. నన్ను స్టాండపాన్ది బెంచి అని అవి బిగ్గరగాచదవమన్నారు. చదువుతాను యముడుగారు చెప్పినట్లు- మీరుకూడా వినండి. ఇవి ఎవరి రచన్సనుండో నాకైతే బాగాతెలీదుకాని హనుమాయమ్మనావెల్స నుంచే అనుకుంటా—

హనుమాయమ్మకోసం వెతక్కండి. హనుమాయమ్మ అనే రచయిత్రి ఫిజికల్‌గాలేదు. ఆవిడ ఒక సింబల్— మీలోనూ, నాలోనూ ఈ చరాచర సృష్టియందంతటా అస్పృశ్యశక్తివలె వ్యాపించియున్నది అని అనుకొందాం. బై ది బై కమింగ్ టు ది పాయింట్— అండర్ లైన్ చేసిన వాక్యాలు చదువుతాన్చదువుతాన్వినండి.

"N....ని కలుసుకునేందుకూ అతని సమక్షంలో హృదయాన్ని కడుగుకునే అవకాశమే లేకపోయింది, సాగర్ డామ్ దగ్గర...." కథానాయికతరపున రైటర్ చెప్తున్న వాక్యాలనిర్మాణం సొంపు యిది.

"అందాల అపరంజిముద్ద రాధ జీవితాన్ని స్వపరం కావించుకొని శరీరసుఖాన్ని పొందడంలో తను యెంతో పెట్టిపుట్టినట్లు అనుభూతి పొందాడు." ఇది కథానాయకుడిగారి జుగుప్సాకరమైన అవస్థని రైటర్ వర్ణిస్తోంది. అప్పుడు కథానాయికిలా అంటుంది సార్! (అతని కౌగలి బిగించి వూపిరి సలుపనివ్వని క్షణంలో) "మీ పవిత్రమైన యీ బంధం నా పాపాల్ని యెత్తి చూపిస్తోంది. నేనెంత ద్రోహిని. ఈ క్షణంలోనైనా నిజం చెప్పేందుకు నోరు రావడంలేదు దేనికి? నా పాపాన్ని మీ ముందుంచి నీకెందుకు (నేనెందుకు అని వుండాలి) ప్రక్షాళనం చేసుకోలేకపోతున్నాను?" అని వాపోతుంది లోలోపలే రచయిత్రి, కాదు కథానాయిక. రచయిత్రికి పశ్చాత్తాపంరాదు రాసిందల్లా అచ్చవుతున్నంతకాలం.

మరోచోట (వేసంకాల వర్ణన) యెండ వేడిమికి కొండల ప్రాంతాలు మరీ దారుణంగావున్నాయి. సదాశివం మోహం కంద దుంపలో వున్నది. (నాకు నవ్వొచ్చి బెంచీమీంచి కిందపడబోతే మావారు నన్ను పట్టుకుని మళ్ళీ తిన్నగా నిలబడి చదవమని ఆజ్ఞాపించారు, నేరక యీ కర్కోటకపుమనిషితో వాదనకుదిగానే అని నేను రచయిత్రుల తెలుగుకి మరికొన్ని అండర్ లైన్ చేసిన వాక్యాలు చదవక తప్పేట్టులేదు) నాయికానాయకులు అవస్థలో పడ్డట్టున్నారు. అప్పుడు వారి డైలాగులు—

"నన్ను నీ ఒళ్ళో పడుకోనివ్వు రాధా అసలీ జన్మలో నాకీ తృప్తి లభిస్తుందనుకోలేదు."

"ఛ! యేం మాటలవి?"

"లేదు రాధా నీకు తెలీదు. యేకాకిలా బ్రతుకుతూ అనామకంగానే చివరిక్షణంవరకూ గడపడం యెంతో కష్టం...."

(చదవడంకూడా మనకెంతో కష్టంగాలేదూ! ఈమె అరడజనుకు పైగా సీరియల్స్‌రాసి బహుమతులుపొందింది.) అనలాగుంచండి. రైటర్ కథానాయిక అనుకున్నట్లుగా ఎలా అనిపిస్తున్నదో ఆ వాక్యాల సొంపు చిత్తగిస్తారా పాఠకమహాశయా— చిత్తగించండి.

"చావుబ్రతుకులమధ్య పెండ్యులం మాదిరి వ్రేలాడే నేర్పు తనకి లేదు" (చావుబ్రతుకులమధ్య వేలాడటానికి నేర్పుకావాలా ఓర్పుకావాలా ఏవిటో ఈ మహారచయిత్రి అయోమయం?)

మరొకచోట—

కానీ ఈ దుర్మార్గుడు మంచివాడు కాడు. వీధి వీధి, వాడ వాడా నాలుక భుజానవేసుకుని తిరుగుతున్నాడు. (దుర్మార్గుడు మంచివాడెలాగ వుతాడు? నాలుక భుజానవేసుకుని తిరగడమేవిటి?)

ఇంకో వాక్యం — అట్టే ఫరవాలేదనుకోండి. కాని చూడండి. "భార్యాభర్తలని రకరకాల కోణాల్లోంచి ఫొటోలు తీస్తున్నారు." (పాంప్ అండ్ షో వర్ణించడమన్న మాట యిది)

ఒక వేరే కథానాయిక తన మాజీ ప్రియునికి రాసే ఉత్తరంలోని వాక్యాలు....

ఆయన ఆల్బంలో నీ ఫొటో చూశాను. యింటినిండా మీ యిద్దరి ఫొటోలే. నువ్వుకూడా నన్ను అనుభవించావనే వుద్దేశ్యం ఆయనకి వుంటే అది భరించలేరాయన" (రామ రామ ఏం తెలుగు? ఏ ఆడది యిలా రాస్తుంది తెలుగులో ఉత్తరం?)

మావారు నెగ్గారు. జుత్తు తీయించుకో నవసరంలేదనుకోండి. ఇందాక "సీరియల్దానా"అని నన్ను తిట్టారుకాని, యిప్పుడు నా మనసుకూడా పూర్తిగా పాకంబుపోయింది.

అప్పుడు మేమిద్దరం తప్పుచేసినవారిలా చేతులుకట్టుకుని నిలబడి—

ఓరి దేవుడా!

మా జాతిని, మా భాషను, మా సంస్కృతిని, మా సాహిత్యాన్ని యీ "హింసాకాండ"నుంచి తప్పించి మమ్మల్ని (పాఠకుల్ని) కాపాడు అని కన్నీళ్ళతో ప్రార్థించాం. రచయిత్రుల తెలుగుకు మచ్చుతునకల్ని మీ ముందుంచి మీ బంగారుమనసుల్నికూడా కంగారుపెట్టినందుకు నన్ను క్షమించాలి.

(హనుమాయమ్మలు- వాళ్ళు మంచి రైటర్స్‌కారని వాళ్ళకు తెలీక లోకంలో మంచి రైటర్స్ లేరనీ, మంచి రైటింగ్స్ రావటంలేదనీ వారు కూడా మొసలి కన్నీరు విడుస్తున్నారు. అసలలా మంచి రైటింగ్స్ రాక పోవడానికి వారిలాటి వారే కారణమని వారికి చెప్పే నాథుడు లేడు. క్షమించాలి--నాథుల్ని వారు కేర్ చేయరు). రచయిత్రుల తెలుగు చూశాక వీరు సంఘంగా వేరే వుండటమే మంచిదనే అభిప్రాయాన్ని మావారు వ్యక్తంచేశారు. రచయిత్రులు రంగంలోకి దిగాక తెలుగుతనం ఎక్కువయిందని అన్న శ్రీ శ్రీగారు పై వాక్యవిన్యాసాలను చూస్తే ఏమంటారో.... ఎవరేమన్నా ఆడా మగా, డోకొచ్చే తెలుగుకథల్లోనూ, నవలల్లోనూ వ్రాయకుందురుగాక!